www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence 08.

## పూర్ణిమాదేవి బర్మన్

అసోం రాష్ట్రానికి చెందిన వన్యప్రాణి సంరక్షకురాలు పూర్ణిమాదేవి బర్మన్‌కు వైట్లీ గోల్డ్ అవార్డ్ లభించింది. స్థానికంగా ఉండే ఒక జాతి కొంగను పరిరక్షించడంలో ఆమె చేసిన కృషికి ఈ అవార్డ్ దక్కింది. ఇక్కడ దీన్ని హర్గిలా అంటారు. ప్రపంచంలో అతి ఎక్కువగా ఈ జాతి కొంగలు కామ్‌రూప్ జిల్లాలో ఉన్నాయి. స్థానికుల సాయంతో కలిసి వీటిని రక్షించినందున ఈ ఘనత ఈ జిల్లాకు దక్కింది. ఇందుకు కృషి చేసిన పూర్ణిమా దేవీ బర్మన్‌కు గ్రీన్ ఆస్కార్‌గా పేరున్న వైట్లీ అవార్డ్ దక్కింది.

nipuna
Every Wednesday Free Supplement
8 మే 2024
పేజీలు 8

## రోజులు

**మే 1**

- ఏటా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా నిర్వహిస్తారు. రోజుకు 8 గంట పని మాత్రమే ఉండాలని డిమాండ్ చేస్తూ 1886లో చికాగోలో మే 1న కార్మికులు ధర్నా నిర్వహించారు. దీంతో ఈ రోజును కార్మిక దినోత్సవంగా నిర్వహించుకోవాలని యూరప్‌లోని సామాజిక హక్కుల కోసం పోరాడుతున్న కార్యకర్తలు నిర్ణయించారు. ఈ ఏడాది ఇతివృత్తం 'పర్యావరణ మార్పు జరుగుతున్న నేపథ్యంలో శ్రమ చేసే ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం ఉండేలా చూసుకోవాలి'.

**ఏప్రిల్ 30**

- ఏప్రిల్ 30న ఆయుష్మాన్ భారత్ యోజన రోజుగా నిర్వహిస్తారు. ఈ పథకానికి సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలిపేందుకు ఉద్దేశించింది ఈ రోజు.

**ఏప్రిల్ 29**

- ఏప్రిల్ 29న ఇంటర్నేషనల్ నృత్యదినోత్సవంగా నిర్వహిస్తారు. యునెస్కోకు అనుబంధంగా ఉండే ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ ఈ రోజును ఏర్పాటు చేసింది.

**ఏప్రిల్ 28**

- శ్రమ చేసే ప్రదేశంలో భద్రత ఆరోగ్యానికి సంబంధించిన రోజుగా ఏప్రిల్ 28ని నిర్వహిస్తారు. వృత్తి పరమైన ప్రమాదాలు, రోగాలను నిరోధించేందుకు ఉద్దేశించిన రోజు ఇది.

## వార్తల్లో వ్యక్తులు

**వైశాలి రమేశ్ బాబు**



- భారత చెస్ క్రీడాకారిణి వైశాలి రమేశ్ బాబుకు గ్రాండ్ మాస్టర్ హోదా దక్కింది. ఈ ఘనతను దక్కించుకున్న భారత మూడో క్రీడాకారిణి ఆమె. కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక గతంలో ఈ హోదాను పొందారు.

**ప్రతిమా సింగ్**

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్‌కు డైరెక్టర్‌గా ప్రతిమా సింగ్ నియమితులయ్యారు.

**మౌసమీ చక్రవర్తి**

- ఆకాశవాణి డైరెక్టర్ జనరల్‌గా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సీనియర్ ఆఫీసర్ మౌసమీ చక్రవర్తి నియమితులయ్యారు.

**కృష్ణ ఎల్లా**

- భారత వ్యాక్సిన్ తయారీదారుల సంఘానికి అధ్యక్షుడిగా కృష్ణ ఎల్లా నియమితులయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఏప్రిల్ 2024 నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుంది.

**కేవీ కామత్**

- కేవీ కామత్ మణిపూర్ అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి గౌరవ డాక్టరేట్‌ను పొందారు. ప్రస్తుతం ఆయన నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్‌కు చైర్మన్‌గా ఉన్నారు.

**అలోక్ శుక్లా**



- ప్రముఖ పర్యావరణవేత్త అలోక్ శుక్లాకు 2024 గోల్డ్‌మన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ లభించింది. ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్‌కు ఆయన కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ అవార్డును పర్యావరణ నోబెల్‌గా పిలుస్తారు.

## అంతర్జాతీయం

**ప్రపంచ ఆరోగ్య సంస్థ**

- జెనీవా కేంద్రంగా ఈ సంస్థ పని చేస్తుంది. 1974లో 'ఎక్స్‌పాండెడ్ ప్రోగ్రామ్ ఆన్ ఇమ్యునైజేషన్ (ఈపీఐ)' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాదితో 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇప్పుడు దీని పేరును 'వ్యాక్సినేషన్‌పై అత్యవసర కార్యక్రమం (ఎసెన్షియల్ ప్రోగ్రామ్ ఆన్ ఇమ్యునైజేషన్)' పేరుతో అమలు చేస్తున్నారు. 13 వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లను ఇస్తున్నారు. భారత్‌లో ఈ కార్యక్రమం 1978లో ప్రారంభమయ్యింది.




**జీ7**

- 2035 నాటికి బొగ్గు ఆధారిత విద్యుత్‌ను లేకుండా చేయాలని జీ7 కూటమిలోని దేశాలకు చెందిన శక్తి, పర్యావరణ మంత్రులు నిర్ణయించారు. ఇటలీలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ కూటమిలో అమెరికా, కెనడా, యూకే, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్ ఉన్నాయి.

**ఐక్యరాజ్యసమితి**

- కీలక శక్తి పరివర్తన ఖనిజాల కోసం ఒక కొత్త ప్యానెల్‌ను ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసింది. పదార్థాలు-శక్తి మధ్య సంబంధాల్లో ఉన్న సవాళ్లను ఇది పరిష్కరిస్తుంది. బాధ్యతాయుతమైన, విలువైన గొలుసులను కూడా ఇది ప్రోత్సహిస్తుంది.

**యూఎన్‌డీపీ**

- క్లైమేట్ ప్రామిస్-2025ను ఆర్థిక సామాజిక మండలికి సంబంధించిన కార్యాలయంలో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించింది. నేషనల్లీ డిటర్మైన్డ్ కంట్రిబ్యూషన్స్‌ను సాధించేందుకు వివిధ దేశాలకు సాయం చేసేందుకు ఉద్దేశించింది ఇది. పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 4 నేషనల్లీ డిటర్మైన్డ్ కంట్రిబ్యూషన్స్‌ను ప్రస్తావిస్తుంది.

**బంగ్లాదేశ్**

- 2025-30 మధ్య కాలంలో 1500 మంది బంగ్లాదేశ్ అధికారులకు భారత్ శిక్షణ ఇవ్వనుంది. ఇందుకు గతంలో ఒప్పందం కుదిరింది. తాజాగా దీన్ని పునరుద్ధరించుకున్నారు.

**శ్రీలంక**

- శ్రీలంకలోని ఉత్తర ప్రావిన్స్‌లో ఉన్న కంకేసంతురాయ్ పోర్ట్‌ను భారత్‌తో కలిసి అభివృద్ధి చేయాలని శ్రీలంక నిర్ణయించింది. అలాగే శ్రీలంకలోని హంబంటోటాలో ఉన్న మట్టల రాజపక్స అంతర్జాతీయ విమానాశ్రయాన్ని భారత్-రష్యాకు చెందిన శౌర్య ఏరోనాటిక్స్ లిమిటెడ్ నిర్వహించనుంది. ఈ విమానాశ్రయం తీవ్ర స్థాయిలో నష్టాల్లో ఉంది. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు భారత క్యాబినెట్ ఆమోదించింది.



**ఇరాక్**

- స్వలింగ వివాహాలు నేరం అనే ఒక కఠిన చట్టాన్ని ఇరాక్ పార్లమెంట్ చేసింది. ఈ తరహా వివాహం చేసుకున్న వాళ్లకు గరిష్ఠంగా 15 సంవత్సరాల జైలు శిక్షను ఆ దేశంలో విధించనున్నారు. అలాగే హోమో సెక్సువల్ అనే పదాన్ని ఎవరూ వినియోగించరాదని, మీడియాపై కూడా ఈ ఆంక్షలు వర్తిస్తాయని గతంలో ఇరాక్ చట్టం చేసింది.

**యూకే**

- సైబర్ దాడులు, హ్యాకింగ్ నుంచి రక్షణ కోసం యూకే పార్లమెంట్ ఒక కొత్త చట్టం చేసింది. అన్ని ఎలక్ట్రానిక్ పరికరాల్లో కఠినమైన పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఈ తరహా చట్టం చేసిన తొలి పార్లమెంట్ యూకే. ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న అన్ని స్మార్ట్ వస్తువులకు కనీస భద్రతా ప్రమాణాలను కూడా ఈ చట్టంలో నిర్దేశించారు.

**అమెరికా**

- మేధో హక్కులకు సంబంధించి అమెరికా విడుదల చేసిన 2024 ప్రత్యేక 301 నివేదికలో భారత్‌ను చేర్చింది. దీన్ని యూఎస్ ట్రేడ్ రిప్రజంటేటివ్ అనే సంస్థ రూపొందించింది.

**సనా**

- 2024లో గ్లోబల్ మీడియా అవార్డును సనా అనే కృత్రిమ మేధ న్యూస్ యాంకర్ గెలుచుకుంది. దక్షిణాసియాలో ఉత్తమంగా ఈ న్యూస్ యాంకర్ నిలిచింది. ఈ అవార్డును ఇండియా టుడే గ్రూప్ ప్రవేశపెట్టింది.




**కెనడా**

- ప్లాస్టిక్‌ను పారదోలేందుకు ప్రపంచ స్థాయి చర్చలు కెనడాలోని ఒట్టావాలో నిర్వహించారు. అయితే ప్లాస్టిక్‌కు సంబంధించి ఆర్థిక అంశాలు ముడిపడి ఉన్నందున ఆశించిన స్థాయిలో చర్చల్లో పురోగతి లేదు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం కూడా లేనందున కచ్చితమైన నిర్ణయాలు ఏవీ ఇందులో తీసుకోలేదు. ఈ ఏడాది దక్షిణకొరియాలోని బుసాన్‌లో జరిగే చర్చల్లో ప్లాస్టిక్‌పై మరో దఫా మాట్లాడుకోవాలని నిర్ణయించారు.

**జినా జస్టస్**

- మధ్య ప్రాచ్యం ఉత్తర ఆఫ్రికా (ఎంఈఎన్ఏ) ప్రాంతానికి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జినా జస్టస్ ఎంపికయ్యారు. ఆమె యూఏఈలోని షార్జాలో విధులు నిర్వహిస్తున్నారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ 2024కు ఈ అవార్డును ప్రకటించింది.

## జాతీయం

**గాంధీసాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం**

- మధ్యప్రదేశ్‌లోని గాంధీసాగర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో వసతులను దక్షిణాఫ్రికా బృందం పరిశీలించింది. ఎనిమిది చీతాలను ఆ దేశం నుంచి భారత్‌కు రప్పిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆ దేశం నుంచి వచ్చిన ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ అభయారణ్యం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. చంబల్ నది దీని గుండా ప్రవహిస్తుంది.



**నీతి ఆయోగ్**

- పట్టణీకరణ నానాటికి వేగంగా జరుగుతూ ఉన్న నేపథ్యంలో అధికంగా వృథా నీరు ఉత్పత్తి అవుతుందని, ఇందులో కేవలం 40% మాత్రమే శుద్ధి చేస్తున్నట్లు నీతి ఆయోగ్ పేర్కొంది. దాన్ని కూడా పునర్వినియోగానికి ఉపయోగించడం లేదని వెల్లడించింది. 'శుద్ధి చేసిన నీటి ప్రోత్సాహం-నీటి వాణిజ్య విధానం' అనే పేరుతో నీతి ఆయోగ్ ఒక నివేదికను విడుదల చేసింది.

**ప్రాజెక్ట్ ఇషాన్**

- ఐఎస్‌హెచ్ఏఎన్ (ఇషాన్) విస్తరణ రూపం- ఇండియన్ సింగిల్ స్కై హార్మోనైజ్డ్ ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్. వాయు రవాణాను నియంత్రించేందుకు ఉద్దేశించింది. ప్రస్తుతం ఈ కేంద్రాలు ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నైలలో ఉన్నాయి. మరో ఉప కేంద్రం గువాహటిలో ఉంది. వీటి స్థానంలో ఒక ఉమ్మడి కేంద్రాన్ని నాగపూర్‌లో ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

**బ్రూ సామాజికవర్గం**

- త్రిపుర ఎన్నికల్లో తొలిసారిగా బ్రూ అనే సామాజికవర్గ ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్నారు. వీళ్లను రింగ్స్ అనే పేరుతో కూడా పిలుస్తారు. మిజోరం త్రిపుర, దక్షిణ అసోంలలో వీళ్లు నివసిస్తారు. అదేవిధంగా అండమాన్-నికోబార్ దీవుల్లోని శోంపెన్ అనే సామాజికవర్గ గిరిజనులు కూడా తొలిసారిగా ఈ ఏడాది లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో పాల్గొన్నారు.

**నగలు-రత్నాల రంగం**

- నగలు-రత్నాల రంగానికి అధీకృత ఆర్థిక నిర్వహణ హోదాను కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ పరిధిలోకి ఈ నిర్వహణ విధానం వస్తుంది. అధీకృత నిర్వహణ విధానాన్ని 2011లో ప్రవేశపెట్టారు. వరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ ప్రధాన కేంద్రం బెల్జియంలోని బ్రెసెల్స్‌లో ఉంది.

**విజింజమ్ పోర్ట్**

- భారతదేశ తొలి ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌గా కేరళలోని విజింజమ్ పోర్ట్ నిలవనుంది. దీన్ని అదాని సంస్థ ఏర్పాటు చేయనుంది.



**నార్వే సంస్థతో ఒప్పందం**

- భారతదేశంలో తేలియాడే సౌర పరిజ్ఞానాన్ని తెచ్చేందుకు భారత్‌కు చెందిన నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ నార్వేకు చెందిన ఓషన్ సన్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. హైడ్రో ఎలాస్టిక్ పొరలపై ఫొటో వోల్టాయిక్ ప్యానళ్లను అమర్చే పరిజ్ఞానాన్ని ఇందులో వినియోగించనున్నారు.

**మహిళల లాజిస్టిక్ హబ్**

- పూర్తిగా మహిళలే నిర్వహించే ఒక లాజిస్టిక్ హబ్‌ను రాజస్థాన్‌లోని సీకర్‌లో ప్రారంభించారు. డెల్హివేరీ అనే సంస్థ దీన్ని అందుబాటులోకి తెచ్చింది. మహిళ సాధికారత సాధించే అంశంలో భాగంగా ఆ సంస్థ దీన్ని ప్రారంభించింది. ఈ సంస్థను 2011లో ప్రారంభించారు.



**రాజ్యాంగ పార్క్**

- భారతదేశంలో తొలిసారి రాజ్యాంగ పార్క్ మహారాష్ట్రలోని పుణెలో రానుంది. భారత సైనిక వ్యవస్థ, పునీత్ బాలన్ గ్రూప్ సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేయనున్నాయి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా నిలవాలంటే పౌరులు ఏమి చేయాలన్న విధుల ప్రాధాన్యతలను తెలియజేసేలా ఇందులో అంశాలు ఉంటాయి.

**నవరత్న**

- ఐఆర్ఈడీఏ, హడ్కో సంస్థలకు నవరత్న హోదా కల్పించారు. కొత్తగా రెండు చేరడంతో నవరత్నాల సంఖ్య 18కి చేరింది. 1997 జూలై 22న నవరత్న సంస్థలు అనే భావనను ప్రవేశపెట్టారు.



**బాంబి బకెట్**

- ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నైనిటాల్‌లో సంభవించిన కార్చిచ్చును భారత వైమానిక దళం 'బాంబి బకెట్'ను వినియోగించి అదుపులోకి తెచ్చింది. ఎంఐ 17 వీ5 అనే హెలికాప్టర్‌ను ఇందుకు వినియోగించింది.

**తగ్గిన పొదుపు**

- భారతదేశంలో నికర గృహాల పొదుపు 47 సంవత్సరాల దిగువకు చేరాయని ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 2023 ఆర్థిక సంవత్సరంలో పొదుపు జీడీపీలో 5.3 శాతం ఉన్నాయి. 2022లో ఇవి 7.3 శాతం ఉండేవి.

**వృద్ధి రేటు**

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు శాతం మించుతుందని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ సంస్థ అంచనా వేసింది. ఆర్‌బీఐ, ఏడీబీ, ఐఎంఎఫ్ వేసిన అంచనా కంటే ఇది అధికం. ఆసియా అభివృద్ధి బ్యాంక్ ప్రకారం 2025 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7% ఉండగా, అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం 6.8 శాతం, ఆర్‌బీఐ ప్రకారం 7% ఉండనుంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

